# చీకటి దీపం

టెలిఫోన్ మోగుతోంది.

అనాసక్తంగా చూసింది శ్యామల. టైం సాయంత్రం మూడు కావస్తోంది. ఎవరై ఉంటారూ అని ఓ క్షణం ఆలోచించింది.

"నాన్నగారేమో?" ఫోన్ ఎత్తి "హలో" అంది - ఎవరూ పలకలేదు.

మరలా "హలో - ఎవరూ" అని అడిగింది.

"మీరు తొందరపడి ఫోన్ పెట్టెయ్యకుండా దయచేసి నేను చెప్పేది శ్రద్ధగా వింటారా మేడం - ప్లీజ్" ఓ మగగొంతు. ఆ గొంతులో అభ్యర్థన ఉంది. సిన్సియారిటీ ఉంది. అగాధాల అట్టడుగున ఘనీభవించిన నీడలా బాధ కూడా ఉంది.

"మీకే నంబర్ కావాలి" శ్యామల గొంతులో విసుగు ధ్వనించింది.

"నాక్కావల్సింది ప్రత్యేకమైన నంబర్ కాదండీ. ప్రత్యేకమైన మనిషి. దయా, సానుభూతీ, జాలి నిండిన మానవత్వం ఉన్న మంచి మనిషి"

"ఇంతకూ మీరెవరు?"

"ఎవరని చెప్పను? ఓ అభాగ్యుణ్ణి. విధి క్రూరంగా వంచించిన దీనుణ్ణి. కాలం కసిగా కాటేసిన వ్యక్తిని"

ఫోన్ చెవికి దూరంగా పెట్టేసింది శ్యామల. బ్లడీ ఫెలోస్-ఇలాగే ఏదో నెంబర్ తిప్పడం-ఆడగొంతు విన్పిస్తే చాలు దయా, జాలీ అంటూ ఏదేదే వాగటం- ఆ తర్వాత ప్రేమా పార్కులూ అనటం. ఈ హైదరాబాద్‌లో టెలిఫోన్ రోమియోలు ఎక్కువైపోయారు. విసుక్కుంటూ ఫోన్ పెట్టెయ్యబోయింది. ఫోన్‌లో ఇంకా మాటలు విన్పిస్తోనే ఉన్నాయి సన్నగా..

"ప్లీజ్ మేడం. దయచేసి ఫోన్ పెట్టెయ్యకండి. మరి కొన్ని నిముషాల్లో చావబోతున్న వాడిని. నాక్కొంత మనశ్శాంతినివ్వండి - చాలు - ప్లీజ్ మేడం"

క్రెడిల్ చేయబోతున్నదల్లా ఆగిపోయింది. మరి కొన్ని నిముషాల్లో చావబోతున్నాడా - ఇదేమైన కొత్తరకం ప్లానా.. స్త్రీ హృదయంలో సహజంగా ఉండే అనంతమైన దయనీ, జాలినీ ఎక్స్‌ప్లాయిట్ చేయడమా? కానీ ఆ గొంతులో ఆతురతా బాధా స్పష్టంగా విన్పిస్తున్నాయి.

"ఎన్నో నంబర్స్ ట్రై చేశాను. కేవలం ఒక ఆర్ద్రమైన మాట కోసం - నా చివరి క్షణాల్లో ఓ పిడికెడు సానుభూతి కోసం - ఇలా ఒంటరిగా చావటం కన్నా ఓ మనసున్న మనిషితో నా బాధను పంచుకుంటూ చావాలని నా కోరిక. అందరూ తిట్టిఫోన్ పెట్టేసిన వాళ్ళే. మీరూ అలా చేస్తే చివరి కోరికైనా తీర్చుకోకుండా ఈ ఇంట్లో ఒంటరిగా బాధగా - చివరి శ్వాస వదుల్తాను."

ఫోన్‌లోని మాటల్ని శ్రద్ధగా వినడానికి ప్రయత్నించడం వల్ల స్పష్టంగా విన్పిస్తోంది.

శ్యామలలో ఓ రకమైన కుతూహలం కలిగింది. పోనీ - అలా వినటం వల్ల తనకేమీ నష్టం లేదుగా అనుకుని ఫోన్‌ని చెవికి దగ్గిరగా పెట్టుకుంది.

"హలో.. హలో.. వింటున్నారా హలో.. హలో.. ప్లీజ్... హలో... హలో" ఒడ్డున పడిన చేపలా కొట్టుకుంటున్నట్లుంది ఆ గొంతు.

శ్యామల మెల్లగా 'హలో' అంది.

"హమ్మయ్య - వింటున్నారన్నమాట. చావబోయే ముందు నాకు మనశ్శాంతి నివ్వదల్చుకున్న మీకు జీవితాంతం మనశ్శాంతి నివ్వమని దేవుణ్ణి ప్రార్థిస్తూ చనిపోతాను"

శ్యామల పూర్తిగా తన కంట్రోల్‌లో కొచ్చేసింది. కుర్చీలో సర్దుకుని కూచుంది. మొహంలో ఓ రకమైన పట్టుదల కన్పిస్తోంది.

గొంతుని వీలైనంత మార్దవంగా ఉంచుతూ అడిగింది.

"మీ పేరేమిటి?"

"రామకృష్ణ - రామకృష్ణ పరమహంస పూర్తి పేరు. ఓ కంపెనీలో ఇంజనీరుని"

"ఏ కంపెనీలో" వెంటనే అడిగింది శ్యామల.

"కావాలనే చెప్పలేదు నేను. మధ్యలో ఏ ఆటంకాలూ లేకుండా చనిపోవాలని నా

కోరిక. నన్నెవరూ రక్షించే ప్రయత్నం చేయవద్దు. నాతో ఈ చివరి క్షణాలోనయనా మాట్లాడితే చాలు"

"మీరు బాగా చదువుకున్న వారై ఉండి ఇలా ఆత్మహత్య చేసుకోవాలనుకోవటంలో నాకు ఔచిత్యం కన్పించడం లేదు. మీరు తొందర పడ్తున్నారేమోననిపిస్తుంది.

"లేదు. నేను తొందరపడటం లేదు. బాగా ఆలోచించుకున్నాకే ఈ నిర్ణయానికి వచ్చాను. అయినా ఏం మిగిలిందని ఈ జీవితంలో-ఎవరున్నారని నాకు-ఎవరికోసం బ్రతకాలి నేను-"

"మంచి ఉద్యోగస్తులైన మీకు తోడే దొరకలేదంటే నమ్మకం కుదరడం లేదు"

"తోడు దొరకకున్నా నాలో ఇంతటి నిరాశ ఉండేది కాదేమో..

ఒంటరితనంలోని స్వేచ్ఛనీ - స్వాతంత్ర్యాన్నీ హాయిగా అనుభవిస్తుండేవాణ్ణి. ఇలా అనుబంధాల మధ్య బందీనై -వూపిరాడక - ప్రేమను చంపుకోలేక, జీవితాన్ని చాలించాల్సిన అతి దయనీయమైన స్థితి ఏర్పడేది కాదేమో."

కాలింగ్‌బెల్ మోగిన శబ్దం ఫోన్‌లో లీలగా విన్పించింది శ్యామలకు. ఎవరో వచ్చి ఉంటారు. టైం చూసింది. మూడుగంటల పదినిముషాలు కావస్తోంది.

"హలో ఇప్పుడే వస్తాను - ఫోన్ పెట్టెయ్యకండి" అటునించి విన్పించింది.

"ఏం- మరలా డయల్ చేయవచ్చుగా"

"మీ నెంబర్ నాకు తెలియదు. చాలా నంబర్లు తిప్పాను. అంకెల్లో అదృష్టాన్ని వెతుక్కునే వ్యక్తిలా - ఓ మృదువైన కంఠం విన్నపుడల్లా ఆశపడ్డాను - మనసు కూడా మృదువుగా ఉంటుందేమోనని. ఆ ఆరాటంలో ఏ నెంబర్ తిప్పితే మీరు కరుణించారో నాకు గుర్తు లేదు. ఎవరో వచ్చినట్లున్నారు. ఓ క్షణంలో పంపించేసి వస్తాను- ప్లీజ్".

ఫోన్ కింద పెట్టిన శబ్దం విన్పించింది. అడుగుల చప్పుడు చాలా చాలా మందంగా - తలుపు తీసిన శబ్దం - ఆ తర్వాత ఏదీ స్పష్టంగా విన్పించడం లేదు.

తన ఫోన్ నెంబర్ తెలియకపోవటం అదృష్టమే. ఓ స్పష్టమైన నిర్ణయానికి రాగలిగింది శ్యామల. తన ఆలోచనల్లో స్ఫురద్రూపి, పొడగరి, మాటకారి, మంచి మనసుకల ఓ అందమైన యువకుడు రూపు దిద్దుకున్నాడు.తన ఎదురుగా కూచుని కళ్ళల్లోకి చూస్తూ-ఆరాధనగా ప్రేమగా

"హల్లో - హల్లో - ఫోన్ పెట్టేశారా - హల్లో" తీయటి ఆలోచనల్లోంచి బయటపడింది. అర్థంలేని ఆలోచనలు - అందుబాటులో లేని ఆశలు- ప్చ్" నిర్లిప్తత తన బలమైన హస్తాల్తో శ్యామలను హృదయానికి దగ్గిరగా హత్తుకుంది. ఎంతటి శాంతి - మరెంతటి రక్షణ -

శ్యామల తన అధీనంలోకి వచ్చేసింది.

"హల్లో"

"ఫోన్ పెట్టేయలేదుగా - థ్యాంక్స్ - పక్కింటివాళ్ళ అబ్బాయి వచ్చాడు. వాళ్ళ ఫోన్ పనిచేయటం లేదు. టెలిఫోన్ డిపార్టుమెంట్‌కి కంప్లెయింట్ చేయాలట. నేనే చేస్తానని చెప్పి పంపించాను.

"మీ చుట్టు పక్కల అందరి ఇళ్ళల్లో ఫోన్లుంటాయా?"

"ఆ - దాదాపు అన్ని ఇళ్ళల్లో"

"అంటే అందరూ బాగా ఉన్నవాళ్ళే నన్నమాట. బంజారాహిల్స్ కాదుగదా"

"కాదు. మీరు అనవసరంగా నేనెక్కడ ఉన్నానో తెల్సుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వృథా శ్రమ. నేను మీకు ఆ అవకాశం ఇవ్వను. అయినా తెల్సుకుని ఏం చేద్దామని"

"మిమ్మల్ని చూద్దామని" శ్యామల మొహంలో తెలీకుండానే సన్నటి చిర్నవ్వు విచ్చుకుంది.

"శవాన్ని చూడాలనే సరదా అంత ఆరోగ్యకరమైంది కాదు. మరో గంటలో నేను ఈ ప్రపంచాన్నే వదిలి సుదూరమైన మరో లోకానికి వెళ్ళిపోతున్నాను. ఓహ్! తల్చుకుంటేనే ఎంత రిలీఫ్‌గా ఉందో - ఊపిరాడనీయని ఈ భవబంధాలూ - స్వార్థం, సంకుచితత్వం నిండిన మనుషులు - ముఖాలకు రకరకాల ముసుగులు తొడుక్కుని నటిస్తూ... ఐ హేట్ దెమ్. పక్కన విషం సీసా ఉంది. సైనైడ్. క్షణాల్లో ప్రాణాల్ని హరించే విషం. ఎక్కువ బాధ పడకుండా చనిపోవచ్చు."

"గంట తర్వాత ఏమైనా ముహూర్తం ఉందా?"

"అవును సుముహూర్తం. ఇన్నాళ్ళ కష్టాలకూ, కన్నీళ్ళకూ చివరి ఘడియలు ఇవే - సరిగ్గా ఇరవై ఎనిమిది సంవత్సరాల క్రితం ఇదే రోజు సాయంత్రం 4.15 నిముషాలకు నేను ఏడుస్తూ ఈ అసహ్యమైన ప్రపంచంలోకి కసిగా విసిరేయబడ్డాను. ఈ రోజు నా ఇరవై

ఎనిమిదవ పుట్టిన రోజు. సరిగ్గా 4.15 నిముషాలకి, నేను విడిచి వచ్చేసిన అమృత తుల్యమైన ఆ భగవంతుడి సన్నిధిలోకి- అనంత సుషుప్తి కౌగిలిలోకి వెళ్ళిపోవాలని కోరిక" అతని గొంతు జీరబోయింది.

శ్యామల మనసు అదోలా అయిపోయింది. ధృవాల అంచుల్లో ఘనీభవించే మంచుముద్దలా - ధరిత్రి కేంద్రంలో ప్రజ్వరిల్లే వేడి కణాల్లా ఉంది మనసు.

అతన్ని ఎలా అయినా బ్రతికించాలని అనుకుంది శ్యామల. ఓ మంచి వ్యక్తి - అర్థంలేని కారణం కోసం బలైపోకూడదు. అతనుండే ఇంటి అడ్రస్ తెలిస్తే బావుండు... లేకపోతే..

"మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ దిడే" అంది శ్యామల బుద్ధిపూర్వకంగా.

పెద్దగా నవ్విన శబ్దం. మృత్యువు కాలి అందెల నాదంలా... అతి చిన్నదైన ఈ శరీర కుహరం నుంచి బైటపడి అనంత విశ్వంలో పరిభ్రమించాలని ఆరాటపడే ఆత్మ -గుండె గోడల మీద అవిశ్రాంతంగా కొట్టుకునే శబ్దంలా -

"మీరు చెప్పాల్సింది అది కాదు. మే యువర్ సోల్ రెస్ట్ యిన్ పీస్" అనాలి. నాకు సరిపోయే వాక్యం అదే".

"పోనీండి కబుర్లేమైనా చెప్పండి" అతను విషాదంలోకి వెళ్ళిపోవడం శ్యామలకు ఇష్టం లేదు.

"ఏం చెప్పను? చాలా కష్టపడి చాదివాను. నా స్వశక్తితో ఓ స్థాయిని, గౌరవాన్ని పొందగలిగాను. చిన్నప్పుడే తల్లిదండ్రుల ప్రేమకు దూరం కావటం వల్లనుకుంటాను ఆత్మీయతలన్నా - ప్రేమమూర్తులైన స్త్రీలన్నాచాలా ఇష్టం. కాని అతి నీచమైన, హేయమైన స్త్రీలు కూడా ఉంటారని తెలీదు నాకు. ఏ స్త్రీనయితే ఆదరించి-ప్రేమించి -పెళ్ళిచేసుకుని-నా జీవిత సర్వస్వమనీ-దేవతనీ-వరమనీ నమ్మానో, అదే స్త్రీ మానసికంగా, సామాజికంగా నన్ను చిత్రవధ చేసి తన దారిన తాను వెళ్ళిపోయింది" అతని గొంతు మరలా గాద్గదికమైంది.

"మీకు పిల్లలా"

"అదే అదృష్టం. పిల్లలే ఉండిఉంటే ఇలా హాయిగా చనిపోయే అవకాశంకూడా దొరికేది కాదు".

"మీలా అందమైన - మంచి మనసున్న భర్తని పోగొట్టుకున్న ఆవిడ దురదృష్ట వంతురాలు. "శ్యామల ప్రతి పదాన్ని జాగ్రత్తగా.. స్పష్టంగా పలికింది. అడ్రస్ తెల్సుకునే అవకాశాలు తక్కువ కాబట్టి మగవాడి అహాన్ని దువ్వి లొంగదీసుకోవడం సులభం అనిపించింది.

"నేను అందంగా ఉంటానని ఎందుకనుకుంటున్నారు?" అతనిలో ఆనందం నిండిన కుతూహలం.

శ్యామల కళ్ళలో ఓ రకమైన తళుకు. పురుషుణ్ణి తరతరాలుగా తన కనుసన్నలలో ఆడించగలనన్న స్త్రీ అహంకారంలోని మెరుపు.

"మీరెలా ఉంటారో నేను చక్కగా ఊహించగలను. చెప్పమంటారా?" కవ్వింపుగా అడిగింది. ఓ యువకుడితో ఇలా మాట్లాడటం తన జీవితంలో మొట్టమొదటి అనుభవం. ఓవైపు గిల్టీగా సిగ్గుగా - మరోవైపు బాధగా - పట్టుదలగా ఉంది.

"చెప్పండి చూద్దాం"

"కరక్ట్‌గా చెప్తే ఏమిస్తారు?"

"మీరేం అడిగితే అది" వెంటనే సమాధానమొచ్చింది.

శ్యామల తనలో తను సన్నగా నవ్వుకుంది. ఎంతటి పసితనం మగవాడిలో! చప్పున చేతుల్లోకి ఎత్తుకుని - గుండెలకు హత్తుకుని - ముద్దాడి - లాలించాలనిపించే మాతృత్వం ఒక్కసారిగా పొంగి మనసంతా నింపివేసింది. "ఇంకో గంటలో చావబోయే వ్యక్తిని - మీకేమివ్వగలను' అనలేదతను. ఒంటరితనం భయంకరశాపంలా అల్లుకున్నప్పుడు, జీవితం నిస్సారంగా, అర్థహీనంగా కన్పిస్తుంది- తన జీవితంలా. ఆ సమయంలో ఓ తోడు లేదా తోడు దొరుకుతుందన్న ఆశ చాలు. మనిషిని మరలా చైతన్య మూర్తినీ, కార్యోన్ముఖుణ్ణీ చేయటానికి - చనిపోవాలనే కోరిక క్షణికమైనది. బ్రతకాలనే ఆశ శాశ్వతమైనది. కారు

మేఘాల్లా కష్టాలు కమ్ముకున్నప్పుడు తటిల్లతలా మెరిసేదే చావాలనే కోరిక. ఓ స్నేహ వీచిక మంద్రంగా వీస్తే చాలు - మేఘాలు చల్లబడి - కురిసి - ఆకాశం అనాచ్ఛాదితమౌతుంది. నగ్నమైన ఆనందంలా...

"ఏమిటీ మౌనం ! ఆలోచిస్తున్నారా"

"ఔను. ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయాను. ఇప్పుడు చెప్తాను వినండి. మీరు చాలా పొడవుంటారు. ఐదడుగుల పదంగుళాల పైనే"

"బాప్‌రే"

"గోధుమ రంగు వర్ణం. స్లిమ్‌గా ఉంటారు. అందమైన కళ్ళు - నల్లటి అందమైన నొక్కులున్న జుట్టు - చక్కగా వంపు తిరిగిన సన్నటి పెదవులు" అంది పెదవుల దగ్గర నొక్కి పట్టి.

ఆ పదాలు తరంగాలుగా సాగి - ప్రవహించి - ప్రయాణించి - అతని శరీరంలో ప్రకంపనాలు కల్గిస్తున్నాయి.

పక పకా నవ్వుతున్న శబ్దం.

"అమ్మాయిననుకున్నారా - అలా వర్ణిస్తున్నారు?"

"ఏమో - అప్పుడే ఎలా తెలుస్తుంది?"

సూటిగా తాకిందామాట. కొన్ని క్షణాల నిశ్శబ్దంలో శ్యామల మనో ఫలకంమీద బాణం దెబ్బతిన్న పక్షిలా కొట్టుకుంటున్న ఓ అందమైన యువకుడు. జాలేసింది. కానీ తప్పదు.

"మీ పేరు చెప్పనేలేదు" తమ మాటల ప్రభావం అతని రక్తంలో కరిగి గుండెకు చేరుతున్న దానికి సాక్షిగా గొంతులో వణుకు -

"మీరడగలేదుగా - నా పేరు హరిణి - అసలు హరితబాల - నేనే మార్చుకున్నా హరిణి అని వేగంగా పరుగెత్తగలదీ అనీ. అయినా ఇవన్నీ ఎందుకడుగుతున్నారు? మీరెవరో నిరూపించుకోవాలా" సమ్మోహనంగా నవ్వింది శ్యామల.

అటునించి ఎటువంటి సమాధానమూ లేదు.

"అయినా డియర్ రామకృష్ణ పరమహంసా - మీక్కావల్సింది శారదాదేవి అనుకుంటూ - అన్వేషించండి - లేదా నన్ను వెతికి బెట్టమన్నా వెతుకుతాను" చిలిపితనం గొంతులో.

అటునుంచి విషాదం లాంటి నిశ్శబ్దం.

శ్యామల గడియారం వైపు చూసింది. టైం 3.30. ఇంకా ముప్పావుగంట టైం ఉంది. ఓసారి చావాలన్న ఆ ఉద్రేకంలోంచి బైట పడేస్తే చాలు. మరోసారి ప్రయత్నించే అవకాశాలు అరుదు.

"తులసీ నేనూ కలిసి తీయించుకున్న ఫోటో ఎదురుగా ఉంది. తులసి ఎంతందంగా ఉందో - "మేడ్‌ఫర్‌ఈచ్ అదర్' అనేవారు. అందంగా నగిషీలు చెక్కిన సువర్ణ పాత్రలో మెరుస్తో కదలాడే విషబిందువు లాంటిది స్త్రీ అని అప్పుడు తెల్సుకోలేకపోయాను"

కొద్దిసేపు మౌనం తర్వాత మరలా మాటలు వినిపించాయి.

"మొదట్లో మందలించాను. కానీ ఇలా బరితెగించిందనీ - రోజుకో టేస్ట్ కావాలనుకునే అసహ్యమైన స్త్రీ అనీ తెలీదు నాకు. రక్తంలో జీర్ణించుకుపోయిన అలవాటుని ఎవరైనా ఎలా మార్చగలరు? నిన్న పనివుండి ఇంటికి త్వరగా వచ్చాను. నా ఇంట్లో - నా పడక గదిలో - నేను అతి పవిత్రంగా చూసుకున్న ఆ పరుపుమీద మరొకరితో - ఓహ్ - పాషాణురాలు. పశ్చాత్తాపమూ - ఆత్మగ్లాని లేని స్త్రీ - అంత సులభంగా బంధాన్ని తెంపుకుని "నీతో కాపురం చేయటం నరకం" అని ముఖం మీదే అనేసి వెళ్ళిపోయింది. కానీ నేను - ప్చ్ .. రేపు సమాజానికి తెలిస్తే నా పరువేం కాను. అందరూ నన్నుచూసి నవ్వుతుంటే ఎలా భరించను? ఇంతటి అవమానాన్ని ఎలా సహించను."

"సంఘానికి సమాధానం చెప్పుకోవాల్సిందీ, తలవొంచుకోవాల్సిందీ, ఆమె - మీరు కాదు. స్త్రీ అయి ఉండీ అలా తెగించి బ్రతగ్గలుగుతున్న ఆవిడ ధైర్యాన్నిమెచ్చుకుంటున్నా - నాకు పిరికి వాళ్ళంటే అసహ్యం" శ్యామల మరోవిధంగా దాడి ప్రారంభించింది.

"క్షమించండి. నాది పిరికితనం కాదు. హృదయ శూన్యతతో రాయిలా బ్రతకడం నాకు రాదు. భార్యలేచిపోతే భర్తని చాతకాని వాడంటుంది సంఘం. భార్యని అదుపులో

పెట్టుకోలేని చవట అని ముద్ర వేస్తుంది. సంఘం విషయం ఎలా ఉన్నా నాకు నేను సమాధానపడి జీవించలేను. తులసిని ప్రాణం కన్న మిన్నగా ప్రేమించాను. ఆ ప్రేమ కోసమే చచ్చిపోతాను"

"అవన్నీ టీనేజర్స్ మాట్లాడే అపరిపక్వమైన మాటలు. ప్రేమ మహోన్నతమైన వరం. సుమధురమైన ఆ ప్రేమామృత రసాస్వాదనలో జీవితాలు వికసిస్తాయి. ఇలా నాశనం అయిపోవు. అనర్హుల కోసం త్యాగాలుచేయటం మూర్ఖత్వం అన్పించుకొంటుంది రామకృష్ణగారూ - ఓ క్షణం ఆలోచించండి. మనకు తెలిసిన వాళ్ళలోనే మంచి మనసున్న స్త్రీలు - ఏ ఆసరాలేక అల్లాడుతున్న వాళ్లున్నారు. వారిలో ఏ ఒక్కరి జీవితానికి మీరు ఆధారమైన మీ జీవితానికో సార్థకత వస్తుంది.

గడియారం నాలుగు గంటలు కొట్టడం లీలగా విన్పించింది శ్యామలకు. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం- అగాధంలా..

మరోపావుగంట - శ్యామల్లో అతన్నిరక్షించాలన్న కోరిక ఉధృతమై మనసంతా అల్లకల్లోలం చేసేస్తుంది.

"నా బాధల్ని పంచుకుంటూ చనిపోవాలనుకున్నాను. మీ దయార్ద్ర హృదయం కారణంగా నా చివరి కోరిక తీరింది. మీకు ధన్యవాదాలు" అతనిలో బాల్యావస్థలోని మొండితనం.

ఆ అవకాశాన్నిజార విడుచుకోలేదు శ్యామల.

"మీ చివరి కోరిక తీర్చిన నన్ను చూడాలనిపించటం లేదా" అతని యవ్వనావస్థని గుర్తు చేసే ప్రయత్నం.

అటునుంచి ఏ సమాధానము లేదు

"మీ తులసికన్నా బావుంటాను, మీ మీదొట్టు"

కొద్దిసేపు ఆగింది. ఏ శబ్దమూ రాలేదు.

"మీ తులసిలా కాకుండా అతి మధురమూ-అద్భుతమూ అయిన ప్రేమ నందిస్తాను. బెట్"

భారంగా ఊపిరి పీలుస్తున్న శబ్దం విన్పిస్తోంది శ్యామలకు.

"అనుమానంగా ఉందా-ఏ కన్నెపిల్లా తను ప్రేమించిన వ్యక్తితో అబద్ధాలు చెప్పదు"

ఈ సారి సమాధానం కోసం ఆగింది. కొన్ని యుగాల్లా అన్పించిన కొన్ని క్షణాల తర్వాత మంద్రంగా విన్పించిందతని గొంతు.

"మీరు నన్ను ప్రేమిస్తున్నారా?"

"ఏం- ప్రేమించడానికి నాకు అర్హతలు లేవా"?

"అహ - అది కాదు. మనం ఒకరినొకరం తెలియకుండా - చూసుకోకుండా...."

"అలానే ప్రేమించుకోవాలని ఏమైనా నియమం ఉందా - మనం ఒకర్ని ఒకరం చూసుకోలేదు కాబట్టి మనది ఆకర్షణ కాదు - అతి స్వచ్ఛమైన పవిత్రమైన ప్రేమ. కేవలం హృదయగతమైంది. మీ మనసు నాకు తెల్సింది. నేను మీకు నచ్చుతానన్న నమ్మకం ఉంది".

శ్యామల తల ఎత్తి చూసింది. టైం 4.15 కావస్తోంది.

"ఏమిటో - నాకేమి అర్థం కావడం లేదు".

"అర్థం కావడానికేముంది. పెళ్ళిళ్ళు దైవ నిర్ణయాలంటారు. నాతో మీకు అవసరం ఉందని నేను ఎలా నమ్ముతున్నానో - మీతో కూడా నా జీవితానికి అంతే అవసరం ఉంది. మీ ప్రేమ కోసం ఒడి ఎదురుగా పరుస్తున్నాను - మీ ఇష్టం".

అతని గొంతులో మార్పొచ్చింది. మాటల్లో మార్పొచ్చింది. తన ఇంటి అడ్రస్, ఆఫీస్ అడ్రస్ అన్నీ వివరంగా చెప్పాడు. శ్యామల గురించి వివరాలడిగాడు. వయసూ - చదువూ - అభిప్రాయాలూ - అభిరుచులూ - చివరికి "మీ అడ్రస్ ఏమిటి? ఎక్కడ కల్సుకోవాలి" అని అడిగాడు.

అడ్రస్ చెప్పలేదు శ్యామల. ఎక్కడ ఎప్పుడు కల్సుకోవాలోచెప్పింది. "నెలలో మొదటి ఆదివారం - అమావాస్య కలిసిన రోజు - సాయంత్రం ఆరింటికి - ఇందిరా పార్క్‌లో - జరీ బోర్డరున్న ఆకు పచ్చ చీర కట్టుకుని మీ కోసం ఎదురుచూస్తాను"

"వెన్నెల రాత్రి కోరుకోకుండా - అమావాస్య........"

"ఆ మాత్రం తెలీదా - వస్తారుగా - అప్పుడు చెప్తాను" కిసుకున్న నవ్వి ఫోన్ పెట్టేసింది.

అప్పటి వరకూ పళ్ళబిగువున ఆనకట్టవేసిన కన్నీళ్ళు వరదలా, ఉప్పెనలా పొంగి చెంపల్ని తడిపేశాయి.

చక్రాల కుర్చీని నడుపుకుంటూ నిలువుటద్దం వరకూ తీసుకెళ్లింది - పాతిక సంవత్సరాల నుంచీ ఈ కుర్చీకి అంకితమై శిథిలమై పోయిన శరీరం అద్దంలో..

"భగవాన్" గట్టిగా కళ్ళు మూసుకుంది శ్యామల. తనకుపదేళ్ళప్పుడు జబ్బు చేసింది - ఏ మందులకూ లొంగని జబ్బు. అప్పటి వరకూ పందెపు గుర్రంలా పరుగెత్తగల తను చక్రాల కుర్చీకి అంకితమై..

అద్దంలోమరోసారి పరీశీలనగా చూసుకుంది శ్యామల. తనను వెక్కిరిస్తూ - దాటుకుంటూ వెళ్ళిపోయిన ముప్పయ్ అయిదు సంవత్సరాలు, అతిక్రూరంగా తన ముఖం మీద వికృతమైన ఛాయల్ని వదిలి వెళ్ళాయి. జీవం కోల్పోయిన కళ్ళు - మరో పదేళ్ళ వయసుని పెంచిన ముడతలు పడుతున్నచర్మం- తెల్లబడుతున్న వెంట్రుకలు - భారీగా పెరిగిన శరీరం - అతి బలహీనంగా, పూచిక పుల్లల్లా ఉన్న కాళ్ళు -

ఎటొచ్చీ మిగిలిపోయింది కంఠంలోని మాధుర్యం మాత్రమే. ఎడారి లాంటి తన జీవితంలో ఏ నాడూ వసంతం తొంగిచూడలేదు. ఏ మగవాడూ తనతోప్రేమగా మాట్లాడలేదు.

శ్యామల గుండెలో తడి !

క్షణమే.... మరుక్షణం జీవంలేని కళ్ళలో కొత్తగా మొగ్గ తొడిగిన -మెరుపు -

అనంతమై... వసంతమై ఎదురుగ్గా అద్దంలో పరావర్తనం చెంది...

అగది నిండా వ్యాపించింది !

ఆ మెరుపు తనూ ఓ జీవితానికి ఆశాకిరణం కాగలిగానన్న 'తృప్తి ది!

ఆ వెలుగు చీకటి చీకటిని వెలిగించగలదన్న ధైర్యానిది, గర్వానిది!!

● ఉదయం వారపత్రిక నవంబర్, 1987 ●